క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బ్రాహ్మణ అపరకర్మల ఆవరణలోని శ్రీ నీలకంఠేశ్వర బాణలింగానికి బుధవారం బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షులు న్యాయవాది రావినూతల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బైటిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికకు ఎంక్రోచ్‌మెంట్ లేకుండా ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేయాలని, అపరకర్మల భవనం నుంచి సిమెంట్ రోడ్డు, కాల్వలు ఏర్పాటు చేయాలని, అదనపు గదులకు నిధులు సమకూర్చాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమెల్యేను సత్కరించారు. ఆలయాభివృద్ధికి ప్రముఖ న్యాయవాది రవి రూ.25వేల విరాళం అందజేశారు. రామచంద్రమూర్తి, డాక్టర్ దివిహయగ్రీవాచార్యులు, శేషగిరిరావు, వేద పండితులు మాడుగుల నాగేంద్ర ఫణిశర్మ, సుధీంద్రాచార్యులు, దేశం సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో పనుల్లో పాల్గొనేందుకు ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా జాబ్‌కార్డు అందజేయవలసిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సంబంధించి 530 కుటుంబాలకు జాబ్‌కార్డులు అందించాల్సి ఉందని, క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించి జాబ్‌కార్డు మంజూరు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఉపాధి పనులకు రోజు వారి లక్ష్యం 3వేల మంది కాగా 2,030 మంది కూలీలు పనుల్లో పాల్గొంటున్నట్లు ఏపీఓ రవిప్రకాష్ వెల్లడించారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్య సంరక్షణ

రుద్రవరం: ఆరోగ్య సంరక్షణకు పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరమని వైద్యాధికారిని శ్రావణి అన్నారు. మండలంలోని అప్పన పల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రుద్రవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ..ప్రతి నెల 4వ బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఉంటుందని,సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.పీహెచ్‌ఎన్ వరలక్ష్మి,ఎంఎల్‌హెచ్‌పి సువర్ణ,104 సిబ్బంది ఉన్నారు.

వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సిటీ): ప్రభుత్వ ఐటీఐ నంద్యాల కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన వాచ్ ఉమెన్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ-ఏ(ఉమన్)కు రిజర్వ్ అయిన పోస్టుకు ఈ నెల 28 నుంచి మే 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారులకు మే 15న ప్రభుత్వ ఐటీఐ డోన్ కళాశాలలో మౌఖిక పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు ప్రచారభేరీ ముగింపు సభ

నంద్యాల(అర్బన్): ఈ నెల 14వ తేదీ నుంచి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరీ గురువారం ముగియనుందని, ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రసాద్, నరసింహులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బుధవారం వారు మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం జాతీయ సమితి పిలుపు మేరకు ప్రారంభమైన ప్రచార భేరీరీ అన్ని గ్రామాలను సందర్శించిందన్నారు. నాయకులు తోట మద్దులు, సోమన్న పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



మృతి చెందిన దస్తగిరమ్మ

రుద్రవరం: మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో దస్తగిరమ్మ (20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హుసేనప్ప,రమణమ్మ దంపతుల కుమార్తె అయిన దస్తగిరమ్మ కొంత కాలంగా కడుపు నొప్పితో అలమటించేంది. వైద్యం చేయించినప్పటికీ నయం కాక పోవడంతో మనస్థానికి గురై.ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

అగ్రవర్ణ పేదలకూ అండగా..



ఆర్థికంగా అండ లభించింది



ఈమె పేరు చిలుకూరు రమణమ్మ. దొర్నిపాడు మండలం అమ్మిరెడ్డి నగరం. ఓసీ అయినా.. కమ్మ కులం కావడంతో పాటు టీడీపీకి అనుకూలురుగా ఉంటున్నారు. అయితే వీరు..తమకు సంక్షేమ పథకాలు ఏవీ రావు అనుకునే వారు. అయితే సచివాలయ సిబ్బంది వచ్చి ఈబీసీ నేస్తం దరఖాస్తు స్వీకరించడంతో రూ. 15 వేలు నగదు ఖాతాలో జమ అయింది. ఈ మొత్తానికి తోడు స్త్రీనిధి, సున్నా వడ్డీ, బ్యాంకు లింకేజీల రూపంలో మరో రూ.50 వేల దాకా వచ్చిన సొమ్ముతో బంకు ఏర్పాటు చేసుకొని ఇంటివద్దే చిన్న వ్యాపారం మొదలు పెట్టింది. ఈ సాయం తనకు ఆర్థికంగా ఎంతో ధైర్యం ఇచ్చిందని ఆమె చెబుతున్నారు.

కూరగాయల వ్యాపారం చేస్తున్నా..



ఈమె పేరు కేశవరెడ్డి లక్ష్మీదేవి. శిరివెళ్ల మండలం జీనెపల్లె గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం, భర్త వెంకటేశ్వర్‌రెడ్డి హమాలీ, ఈమె వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈమెకు గతేడాది నుంచి ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు రావడంతో ఆ నగదుతో కూలీకి పోయివచ్చిన తరువాత సాయంత్రం గ్రామంలో కూరగాయల వ్యాపారం చేసుకుంటోంది. ఈ మొత్తానికి తోడు జగనన్న చేదోడు కింద రూ.10 వేలు వడ్డీ లేని రుణం రావడంతో వ్యాపారం మరింత పెంచుకుంది. ఈ ఏడాది కూడా ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు వచ్చిందని, కూలీకి పోకుండా వ్యాపారం పెంచుకుంటానని చెబుతోంది.

ప్రభుత్వం నుంచి తొలి సాయం



ఈమె ఉయ్యాలవాడకు చెందిన శివలక్షమ్మ. చిన్నకారు రైతు కుటుంబం అయినా.. రెడ్డి కులంలో పుట్టడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందేవి కాదు. వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఈబీసీ నేస్తం పథకం ద్వారా రూ.15 వేలు వస్తుందని ఆధార్ కార్డు ఇవ్వమని అడిగితే మొదట నమ్మలేదు. నగదు అకౌంట్‌లో జమ అయిందని మెసేజ్ రావడంతో సంతోషం వ్యక్తం చేస్తోంది. తొలిసారిగా ప్రభుత్వం నుంచి సాయం తీసుకున్నా.. ఈ డబ్బుతో జీవనోపాధి మెరుగుపరుచుకుంటానని హర్షం వ్యక్తం చేస్తోంది.

ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోలేదు



ఇక్కడ కిరాణా కొట్టులో నిలుచున్న మహిళ మనోహరమ్మ. శిరివెళ్ల గ్రామంలో నిరుపేద వైశ్య కులం. నిరుపేదలు అయినప్పటికీ ఓసీలు కావడంతో ప్రభుత్వం నుంచి ఏ పథకం అందలేదు. చిన్న కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. రెండేళ్లుగా పథకం వర్తించడంతో కిరాణా వ్యాపారం మరింత విస్తరించుకున్నారు. తాము ఎవరినీ అడగకపోయినా పథకం వర్తించడంపై సంతోషం వ్యక్తం చేస్తుంది.

- ఏడాదికి అగ్రవర్ణ పేద మహిళలకు రూ.15 వేలు అందజేత
- వరుసగా రెండో ఏడాది 'ఈబీసీ నేస్తం'
- జిల్లాలో రెండో విడతలో 14,794 మందికి లబ్ధి

ఆళ్లగడ్డ: అగ్రవర్ణాల్లోని పేద అక్కచెల్లమ్మలకూ అండగా నిలవాలని, వారిని కూడా అభివృద్ధి పథంలో నడిపించాలని ఏడాదికి రూ 15 వేలు చొప్పున అందిస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వారికి కూడా మంచి జరగాలనే ఉద్దేశంతో ‘వైఎస్సార్ ఈబీసీ నేస్తం’ అమలు చేస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అగ్రవర్ణ సామాజిక వర్గాల్లోని పేద మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఈబీసీ నేస్తం పథకం ద్వారా 45 సంవత్సరాలు నిండిన కమ్మ, రెడ్డి, వైశ్య,బ్రాహ్మణ, క్షత్రియ తదితర కులాల్లోని పేద మహిళలకు ఏటా రూ.15 వేలు అందిస్తున్నారు. ఈ క్రమంలో రెండో దఫాలో భాగంగా జిల్లాలోని 29 మండలాల్లో మొదటి విడత (2021 – 22)కు సంబంధించి గతేడాది జనవరి 25న 13,631 మంది మహిళల ఖాతాల్లో రూ 20.4465 కోట్లు జమ చేయగా, రెండో విడతలో భాగంగా గత ఏడాది కంటే అదనంగా 1,163 మందిని ఎంపిక చేసి మొత్తం 14,794 మంది లబ్ధిదారుల ఖాతాల్లో ఈ నెల 12న రూ 22.1910 కోట్లు నేరుగా జమ చేశారు.

నియోజకవర్గాల వారీగా ఈబీసీ నేస్తం పథకం ..

నియోజకవర్గం	రెడ్డి	కమ్మ	ఆర్యవైశ్య	బ్రాహ్మణ	ఇతరులు	మొత్తం లబ్ధిదారులు	జమఅయిన మొత్తం
ఆళ్లగడ్డ	2,427	205	447	50	67	3196	రూ. 4,79,40,000
బనగానపల్లె	2,754	160	325	68	45	3352	రూ. 5,02,80,000
డోన్	1,332	231	319	35	29	1946	రూ. 2,91,90,000
నందికోట్కూరు	1,174	77	239	47	57	1594	రూ. 2,39,10,000
నంద్యాల	1,660	125	872	112	67	2836	రూ. 4,25,40,000
శ్రీశైలం	1,146	217	378	62	67	1870	రూ. 2,80,50,000
మొత్తం	10,493	1,015	2,580	374	332	14,794	రూ 22,19,10,000

అర్హులందరికీ అందజేశాం

ఓసీల్లోని పేదలు కూడా ఆర్థిక పురోగతి సాధించాలనే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. అర్హులందరికీ అందజేస్తున్నాం.

– నాగేశ్వరరావు, ఈడీ , బీసీ కార్పొరేషన్

ఆళ్లగడ్డ డీఎస్పీగా వెంకటరామయ్య



ఆళ్లగడ్డ: నూతన డీఎస్పీగా వెంకటరామయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని తిరుపతి ఎస్‌బీఐకి బదిలీ చేశారు. ఈయన స్థానంలో కర్నూలు దిశ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరామయ్యను నియమించారు. వెంకటరామయ్య గతంలో ఆళ్లగడ్డ ఎస్‌ఐగా, సీఐగా విధులు నిర్వహించడంతో పాటు కొంత కాలం అటాచ్‌డ్ డీఎస్పీగా వ్యవహరించారు. త్వరలో విధుల్లో చేరే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.

అందుబాటులో నానో డీఏపీ

దొర్నిపాడు: సహకార సంఘాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఇక నుంచి నానో డీఏపీ (లిక్విడ్) అందుబాటులోకి రానునందని సొసైటీ చైర్మన్ బాల వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గుండుపాపల సొసైటీ ఆవరణలో ఇఫ్‌కో నానో సదన్ డీఏపీని మార్కెట్‌లోకి విడుదల చేసే కార్యక్రమాన్ని ఇఫ్‌కో మేనేజర్ మధుబాబు రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. ఇప్పటి వరకు నానో యూరియా వచ్చిందని, ప్రస్తుతం 500 ఎంఎల్ బాటిల్ డీఏపీ ధర రూ.600 ఉందని చెప్పారు.

ఆళ్లగడ్డలో చోరీ

ఆళ్లగడ్డ: వేడిమి తట్టుకోలేక ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా మిద్దెపై పడుకున్నారు. ఇదే అదనుగా భావించి ఓ ఆగంతకుడు తాళం పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకెళ్లిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గాయత్రీ దేవాలయం సమీపంలో రమాదేవి అనే మహిళ మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్ర పోయారు. తెల్లారి లేసి ఇంట్లోకి వెళ్దామని వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో లబోదిబోమంటూ లోపలికి వెళ్లి చూడగా.. బీరువా తలుపులు బద్దలుగొట్టి ఉండటం, అందులో నున్న 80 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

నాడు మోపు.. నేడు చుట్ట



గుడ్డతో మోపులు కట్టుకొని మోసుకెళ్తున్న మహిళలు,



యంత్రంతో చుట్టలుగా కట్టిన గడ్డిని తీసుకెళ్తున్న రైతు

దొర్నిపాడు: నిన్నటి వరకు వరి కోతలను కూలీల ద్వారా చేయించేవారు. ఈ పద్ధతిలో సమయం ఎక్కువగా పడుతుండటంతో పాటు ఖర్చు,అధిక శ్రమ అవసరమయ్యేది. యంత్రాలు రావడంతో వాటి ద్వారా నూర్పిళ్లు చేయిస్తున్నారు.దీంతో సమయంతో పాటు ఖర్చు కూడా తగ్గిపోయింది.అలాగే.. కూలీల ఇబ్బందులు తప్పాయి.అలాగే కోతల అనంతరం వరి గడ్డిని పశువులకు మేతగా వినియోగించడం తెలిసిందే. మొన్నటి వరకు మోపులుగా తీసుకెళ్లేవారు. ప్రస్తుతం మిషన్‌ల ద్వారా గడ్డిని చుట్టలుగా చుట్టి వేస్తుండటంతో రవాణాకు ఇబ్బందులు తొలగాయి. అలాగే.. సులభంగా మోసుకెళ్తున్నారు. ఇక ఈ చుట్టలను ఇంటికి తెచ్చుకొని వాములు వేసుకోవడానికి శ్రమ తక్కువగా అవసరమవుతుండటంతో అధిక శాతం రైతులు చుట్టలుగా చుట్టిన గడ్డిని తరలిస్తున్నారు. గతంలో తాడు, గుడ్డలతో మోపుగా కట్టుకొని తలపై పెట్టుకొని తీసుకెళ్లేవారు.

సంక్షేమంతో ఆదర్శపాలన



సంక్షేమ పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కానాల గ్రామంలో సాయంత్రం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దుష్ప్రచారాలు చేస్తున్నారని, కానీ ప్రజలు వారి మాటలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో 13 శాఖల అధికారులతో ఇంటింటికి వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత పాలకులతో ప్రస్తుత పాలనను బేరీజు వేసుకొని మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.ఎంఈపీ శెట్టిప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ బావమ్మ, ఎంపీటీసీలు జమీరుద్దీన్, రంగారావు, నాయకులు జగదీశ్వరరెడ్డి, దూదేకుల ఖాసీం , చిన్నయ్య, వృశేని పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



మంజు భార్గవి



అమీనాబీ

శిరివెళ్ల: ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మోడల్ స్కూల్ 43.50 శాతం ఉత్తీర్ణత సాధించింది. స్కూల్‌లో మొత్తం 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 30 మంది ఉత్తీర్ణులయ్యారు. స్కూల్‌లో బైపీసీలో వెయ్యి మార్కులకు గాను మంజుభార్గవి 879 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే ప్రథమ సంవత్సరం పరీక్షలలో స్కూల్ 20 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 65 మంది పరీక్షలు రాయగా అందులో 13 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో 475 మార్కులకుగాను రామేశ్వరుడు 435 మార్కులు సాధిచించాడు. బైపీసీలో 440 మార్కులకు గాను ఇంద్రావతి 353 మార్కులు సాధించి ఆ విభాగంలో టాపర్‌గా నిలిచింది. అలాగే కస్తూర్బా పాఠశాల ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 44 శాతం ఉత్తీర్ణత సాధించింది. స్కూల్‌లో ఎంపీసీ విభాగంలో 16 మంది పరీక్షలు రాయగా ఏడుగురు విద్యార్థులు పాసయ్యారు. దూదేకుల అమీనాబీ 474 మార్కులకు గాను 430 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.



రూప



పావని

సత్తా చాటిన కేవీ సుబ్బారెడ్డి విద్యార్థులు

ఆళ్లగడ్డ: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటరని కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. సీనియర్ బైపీసీ విభాగంలో రూప 982 మార్కులు, పావని 979, సీఈసీలో రాజేశ్వరి 957, హెచ్‌ఈసీలో ఉత్తమ సింగ్ 927, జూనియర్ ఎంపీసీలో అశ్విని 454, బైపీసీలో రషీద్ 420, సీఈసీలో అబ్దుల్ రషీద్ 439, హెచ్‌ఈసీ ఆషిదిని నాయక్ 440 మార్కులు సాధించారని వివరించారు.

ప్రజ్ఞ కళాశాలలో..

స్థానిక ప్రజ్ఞా కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని కళాశాల నిర్వాహకురాలు హేమలతారెడ్డి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో భార్గవరెడ్డి 462, బైపీసీలో సోనియా 456, నాగజ్యోతి 418, వసంత 415 మార్కులు సాధించగా సీఈసీలో ప్రవళిక 482, సాయికిషోర్ 478 మార్కులు సాధించారని చెప్పారు.

పట్టణాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): జిల్లా కేంద్రం నంద్యాల పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం స్థానిక ఆటోనగర్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రూ.24 లక్షలతో నంద్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సుందరమైన పార్కును ప్రారంభించారు. భవిష్యత్‌లో పట్టణ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆటోనగర్ అసోసియేషన్ ప్రతినిధులు, జాకీర్, జాకీర్‌హుసేన్, యూనిస్, కౌన్సిలర్ బాషిద్, నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తిక్కారెడ్డి పాల్గొన్నారు.

సస్పెన్షన్‌లను ఎత్తేయాలి

నంద్యాల(అర్బన్):ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్‌లు ఎత్తివేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాధవస్వామి, సెక్రటరీ సుబ్బన్న కోరారు. అకారణంగా ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం తగదంటూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లు సరైనవి కావన్నారు. విద్యార్థులు వారి తల్లితండ్రుల ఎదుట ఉపాధ్యాయులను అవమానించేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలన్నారు. సంఘం నాయకులు జమాన్, ప్రసాద్, శివయ్య, మహ్మద్ రఫీ, దస్తగిరి, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, సంధ్యారాణి, సుజాత పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం



సర్పంచులను సన్మానిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండలంలోని 4 గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు రావడం గర్వ కారణమని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిరివెళ్ల, యర్రగుంట్ల, గంగవరం, మహదేవపురం గ్రామ సర్పంచులు సాలమ్మ, సుభహాన్, మహాలక్ష్మీ, పెద్ది రమణయ్య, పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సన్మానించారు. ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు మందాల రాధిక, వీరారెడ్డిపల్లె సర్పంచు శివారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటుపై హర్షం



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): హైదరాబాద్‌లో ఉన్న రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయాన్ని కర్నూలుకు తరలింపుపై రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటయ్యేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం అభినందనీయమన్నారు. శ్రీభాగ్ ఒడంబడికను గౌరవిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనలో భాగంగా చేపట్టిన ఈ చర్యను అభినందిస్తున్నామన్నారు. దీంతో పాటు న్యాయ సంబంధమైన తెలుగు రాష్ట్రాల కృష్ణా జలాల వివాదానికి పరిష్కారమార్గం చూపాలని కోరారు. ఇందుకు బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు వైఎస్ రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, ఖాసీం మియ్యా, భాస్కర్‌రెడ్డి, కొమ్మాశ్రీహరి, సుధాకర్‌రావు, రాఘవేంద్రగౌడ్ పాల్గొన్నారు.

వర్షం కురిసింది..పైరు నేల వాలింది



చిన్నకంబలూరు మెట్ట వద్ద నేలవాలిన వరిపైరు



ఉదయం 8 గంటల సమయంలో క్రిష్టిపాడుపై మేఘాలు కమ్మేసిన దృశ్యం

రుద్రవరం: మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి రెండు గంటల పాటు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో మండలంలోని చిన్న కంబలూరు,అప్పనపల్లె,ఎల్లావత్తుల,బీ.నాగిరెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో వరి పైరు నేలవాలింది. పంట కాలం పూర్తయ్యి కోత కోసే సమయంలో అకాల వర్షం,గాలి నట్టేట ముంచుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా తాము నష్టాలు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కాలం పూర్తి కావడంతో ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దిగుబడులను కొందరు రైతులు పసిమి మీదనే విక్రయంచుకుంటుండగా, మరి కొందరు నిల్వ చేసుకునేందుకు ఆరబెట్టుకుంటున్నారు. ఇంతలో ఉన్న ఫలంగా వర్షం కురవడంతో పైరు నేల వాలడంతో పాటు ఆరబెట్టిన ధాన్యం తడిసి పోయింది. తడిసిన ధాన్యం రంగు మారుతుందన్న భయం కొందరిలో,కోత సమయంలో పైరు నేల వాలడంతో కోత ఖర్చు భారం పెరిగి పోతుందని మరి కొందరు వాపోయారు.

పగలే చీకటిలా..

దొర్నిపాడు:బుధవారం ఉదయం 8 గంటలు..ఆకాశంలో ఉరుములు, మెరుపులు.. భానుడిని మేఘా లు కమ్మేయడంతో పగలే చీకటి అన్నట్లుగా వాతావరణం మారిపోయింది. దీంతో భారీ వర్షం కురుస్తుందేమనని రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం రబీ వరి కోతలు, కల్లాలోనే మిరప మండెలు ఉన్నాయి. మొత్తానికి అరగంటలో గాలి వీయడంతో మేఘాలు తేలిపోయాయి.అలాగే మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతన్నలు ఊపిరి పీల్చుకున్నారు.

2,257 గృహాలు మంజూరు



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నాగరాజు

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని 49 జగనన్న కాలనీలకు సంబంధించి 2,257 గృహాలు ప్రభుత్వం కుడా కింద రెండవ విడత మంజూరు చేసిందని హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో డీఈ మాట్లాడారు. రుద్రవరం మండలానికి 739 గృహాలు, దొర్నిపాడు 557, చాగమలర్రి 420, ఆళ్లగడ్డ 218, ఉయ్యాలవాడ 268, శిరివెళ్లకు 55 గృహాలు మంజూరయినట్లు వివరించారు. మండల సమన్వయ కమిటీలో ఎంపీడీఓ, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఏఈలు, ఏపీఎం బృందం కలిసి కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా మంజూరైన వారికి వారం రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని చెప్పారు. ఆర్.పాంపల్లె గ్రామానికి 44, సర్వాయిపల్లె 44, ఇంజేడు 53, ఉయ్యాలవాడకు 127 గృహాలు జగనన్న కాలనీలకు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షాధిక్‌బాషా పాల్గొన్నారు.